క్లుప్తంగా

సివిల్ రైట్స్‌పై మహిళలకు అవగాహన

తాళ్లపూడి: ప్రతి ఒక్కరూ తమకు గల హక్కులను పొందాలని పంచాయతీ కార్యదర్శి కామేశ్వరి తెలిపారు. మండలంలోని మలకపల్లిలో శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలను వివరించారు. ఈ సమావేశంలో కార్యదర్శి కామేశ్వరితో పాటు వీఆర్వో ఎం.ప్రకాష్,హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఎంప్లాయీస్ విభాగం అధ్యక్షుడిగా ప్రసాదబాబు



దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గం ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడిగా గోపాలపురం మండలం చిట్యాలకు చెందిన మాజీ ఐఎఫ్ఎస్ అధి కారి, మాజీ సర్పంచ్ పీతల ప్రసాద్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఓ ప్రకటన విడుదలైందని ప్రసాద్‌బాబు తెలిపారు.

వైభవంగా స్వామివారి పుష్పయాగం

నిడదవోలు : పట్టణంలో వేంచేసియున్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామివారికి పుష్పయాగోత్సవాన్ని (పవళింపు సేవ) వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహ శాస్త్రి, అర్చకుడు అభిరామ్ శర్మ పాల్గొన్నారు.

జేసీబీ, ఐదు ట్రాక్టర్ల సీజ్

దేవరపల్లి: యర్నగూడెం, కృష్ణంపాలెం గ్రామాల పరిధిలోని పోలవరం కుడి కాలువ మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి కాలువ గట్టును తవ్వి మట్టిని ట్రాక్టర్లపై తరలిస్తుండగా గ్రామానికి చెందిన రైతులు అడ్డుకుని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. మట్టిని తవ్వుతున్న జేసీబీ, రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటిని సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు తహసీల్దార్ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొవ్వూరు: కుమారదేవం గ్రామ సమీపంలో శనివారం ట్యాంకర్ అదుపుతప్పి మోటారు సైకిల్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన ముగ్గురు యువకులు తీవ్ర గాయాల పాలయ్యారు.చొటుపల్లి నాగేంద్ర, పసుపులేటి మధు, కామిశెట్టి గణేష్ మోటారుసైకిల్‌పై కొవ్వూరు వస్తుండగా ప్రమాదం బారిన పడ్డారు. తీవ్ర గాయాలపాలైన ముగ్గురినీ కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గణేష్‌కు మోకాలు దిగువ భాగంలో కాలు విరిగిపోయి ఎముక బయటికి వచ్చింది. మిగిలిన ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. నాగేంద్ర బాబు అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు తెలిపారు.

సోమాలమ్మ ఆలయంలో చోరీ

కొవ్వూరు: నందమూరులో గ్రామ దేవత సోమాలమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి దుండగులు హుండీని పగలుకొట్టి దానిలో సొమ్మును అపహరించారు.అమ్మవారికి అలంకరించిన వెండి ఆభరణాలను దొంగిలించుకుని పోయారు. ఉగాది సందర్భంగా నిర్వహించే గ్రామోత్సవం నిమిత్తం శనివారం ఆలయానికి వెళ్లిన గ్రామస్తులు చోరీ జరిగిందని గుర్తించారు. రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వీధి దీపాల నిర్వహణ లేక అవస్థలు

- ప్రజా సమస్యలపై కౌన్సిలర్ల ఏకరవు
- నిడదవోలులో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

నిడదవోలు : వీధి దీపాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ మాలరాజు మాట్లాడుతూ పట్టణంలో 15,16 వార్డులతో పాటు మార్కెట్, రైల్వేస్టేషన్ రోడ్డులో వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల రాత్రి సమయంలో ఓ వృద్ధుడిని వీధి కుక్కలు దాడి చేసి కరవడంతో గాయాలపాలయ్యాడని తెలిపారు. కుక్కల స్వైరవిహారాన్ని అరికట్టాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మున్సిపల్ ఏఈ హేమంత్ సమాధానం ఇస్తూ విద్యుత్ సామగ్రి లేక ఇబ్బందులు పడుతున్నామని, త్వరలో సమస్యను పరిష్కరించే చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పువ్వల రతీదేవి మాట్లాడుతూ ప్రభుత్వ నిధులను ప్రైవేట్ విద్యా సంస్థలకు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీ నిధులు రూ.2.50 లక్షలను ఎన్టీఆర్ కాలనీలో ఫ్రాన్సాలియన్ విద్యాజ్యోతి కళాశాలలో కమ్యూనిటీ తాగునీటి ప్లాంట్ ఏర్పాటుకు అధికారులు 9వ అంశంగా చేర్చడంపై వివరణ ఇవ్వాలని రతీదేవి కోరారు. దీనిపై మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ మాట్లాడుతూ కమ్యూనిటీ ట్రస్టుగా ఉన్నందున ప్రతిపాదించామన్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎస్కే వజీరుద్దీన్ మాట్లాడుతూ వైఎస్సార్ నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నందున ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ మాట్లాడుతూ పట్టణంలో 22వ వార్డులో పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ లే-అవుట్‌లో గృహాలకు, అక్కడ ప్రతిపాదించిన సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు (ఎస్టీపీ) సరైన అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో నెలకొన్న ఇబ్బందులను అధిగమించేందుకు కోటసత్తెమ్మ ఆలయం వెనుక వైపు రోడ్డు నుంచి అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ సాధారణ నిధులు రూ.29 లక్షలు కేటాయిస్తున్నట్లు సభ్యుల ఆమోదాన్ని కోరారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు వేసవిని దృష్టిలో పట్టణంలో ఆరు ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు మున్సిపల్ సాధారణ నిధులు రూ.4.96 లక్షలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సాధారణ సమావేశంలో 22 అంశాలు, అత్యవసర సమావేశంలో 22 అంశాలను ఆమోదిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్ ప్రకటించడంతో సమావేశాన్ని ముగించారు. ఈకార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





సమావేశానికి హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ (ఇన్‌సెట్)

ప్రజల సొమ్ముతో కుంభమేళాకు అధికారులు!

నిడదవోలు : ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్ములతో కుంభమేళాకు వెళ్లిన నిడదవోలు మున్సిపాలిటీకి చెందిన ముగ్గురు అధికారుల ఖర్చుల నిమిత్తం మున్సిపల్ సాధారణ నిధులు రూ.3 లక్షలు మంజూరు చేయడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇదెక్కడి చోద్యం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి సర్కార్ పేదలకు సంక్షేమ పథకాలు అందించకపోగా ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్ములను దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. మున్సిపల్ సాధారణ నిధులు కుంభమేళాకు వెళ్లడానికి అయ్యే ఖర్చులను అధికారులకు కేటాయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలు ఏర్పాట్లు, మౌలిక వసతులు ప్రణాళికలు తెలుసుకోవడం కోసం ఉత్తరప్రదేశ్ మహా కుంభమేళాలో అనుసరించిన విధానాలను తెలుసుకునేందుకు రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు, నరసాపురం మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ అధికారులను గత ఫిబ్రవరి 18న కుంభమేళాకు వెళ్లారు. ఈ క్రమంలో నిడదవోలు మున్సిపాలిటీకి చెందిన మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, మున్సిపల్ ఏఈఈ సామవేదం హేమంత్ కమల్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ కె.శివ సాయికుమార్ మహా కుంభమేళాకు వెళ్లారు. మహా కుంభమేళాలో అనుసరించిన విధి విధానాలను అధ్యయనం చేసినట్టు వారన్నారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే నిడదవోలు నుంచి కుంభమేళాకు వెళ్లడానికి విమాన టికెట్లు, భోజన వసతి కోసం రూ.3 లక్షలు ఖర్చు అయ్యిందని అంచనా వేశారు. అత్యవసర ఖర్చులు అంటూ మున్సిపల్ సాధారణ విధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు కోసం మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ కౌన్సిల్ అజెండాలోకి తీసుకువచ్చారు. శనివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని కౌన్సిల్ సభ్యులు కూడా ఆమోదించడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన సొమ్మును అధికారులకు ప్రయాణానికి కేటాయించడంపై వారు ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసి వారి ఖర్చుల నిమిత్తం ఇవ్వాల్సింది పోయి ప్రజల సొమ్మును కేటాయించడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. పన్నుల రూపంలో వచ్చే మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపడతారు. ఆస్తి, ఖాళీ స్థలాలు, మంచి నీటి పన్నులు, మున్సిపల్ షాపులు, మార్కెట్ పాటల ద్వారా ఆసీలు వసూళ్లు, ప్రకటనలు, వ్యాపారుల ట్రేడ్ లైసెన్సుల వంటి పన్నుల రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం చేకూరుతోంది. ఇలా సమకూరిన మున్సిపల్ సాధారణ నిధులతో పారిశుధ్య ఔట్‌సోర్సింగ్ కార్మికులు, మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లిస్తారు. రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, వీధి దీపాల నిర్వాహణ, మంచినీటి సరఫరాకు సంబంధించిన కరెంటు బిల్లులు, పైపులైన్ల మరమ్మతులకు ఖర్చు చేస్తారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.3 లక్షలు కేటాయించడంపై పట్టణ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కుంభమేళాకు ముగ్గురు అధికారులకు అయ్యే ఖర్చును ప్రభుత్వ నిధుల నుండి మంజూరు చేయాలని, సాధారణ నిధులు పట్టణాభివృద్ధికి, వేసవిలో తాగు నీటి ఎద్దడి నివారణకు అత్యవసర పనులకు కేటాయివచాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పోక్సో చట్టంతో లైంగిక నేరాల నుంచి పిల్లలకు రక్షణ



దొమ్మేరులో మాట్లాడుతున్న జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి అనురాధ

కొవ్వూరు: చిన్న పిల్లలకు తల్లిదండ్రులు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కల్పించాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎం.అనురాధ పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండలం సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం దొమ్మేరులో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అనురాధ మాట్లాడుతూ చిన్నారుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించకుండా ఉండేందుకే పోక్సో చట్టం తీసుకొచ్చారన్నారు. చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లికి, దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఇటీవల నమోదైన కేసులను పరిశీలిస్తే ఎక్కువ శాతం దగ్గర రక్త సంబంధీకులే అఘాయిత్యాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలకు ఎవరితో ఏవిధంగా మెలగాలన్న విషయం తెలియజేయాలని సూచించారు. లైంగిక నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు పోక్సో చట్టం లక్ష్యమని అన్నారు. సీడీపీవో డి.మమ్మి,సర్పంచ్ తానేటి కుమారి, న్యాయవాదులు కోడూరి రాఘవులు, యాగంటి చలపతి, వై ప్రకాష్, వి.నంద, పి.హరిష్, డీవీ రవికుమార్, సీహెచ్ శ్రీనివాస్, డి.నందకుమార్, డి.వెంకటరాజు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి



శిక్షణలో మాట్లాడుతున్న డీఎం రాధిక

దేవరపల్లి: రబీ ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.రాధిక అధికారులకు సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై రైతు సేవా కేంద్రాలు, సొసైటీల సిబ్బంది, వ్యవసాయాధికారులు, సాంకేతిక సిబ్బంది, పౌర సరఫరా అధికారులకు స్థానిక కరుటూరి ఫంక్షన్ హాలులో శనివారం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు., ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందీ కలగకుండా చూడాల్సిన బాధ్యత రైతు సేవా కేంద్రాల సిబ్బందిపై ఉందన్నారు. పౌర సరఫరాల శాఖ సహాయ అధికారి ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ, టెక్నికల్ అసిస్టెంట్లు గోనె సంచుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో మిల్లర్లు లాగిన్ అయినట్లు చూపించడం లేదని తెలిపారు. డివిజినల్ సహకార శాఖ అధికారి ఎం.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన సొసైటీలకు నగదు త్వరగా విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ ఎస్.జయలక్ష్మి, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, నాలుగు మండలాల పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు



తీపర్రులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతులకు సన్మానం

పెరవలి: ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు కలగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ మేనేజర్ (డీపీఎం) తాతారావు తెలిపారు. పెరవలి మండలం తీపర్రులో నియోజకవర్గంలోని మూడు మండలాల వ్యవసాయాధికారులు, ఆదర్శ రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రకృతి వ్యవసాయం 39,000 మంది రైతులు 45 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ సాగు విస్తీర్ణం మరింత పెంచటానికి తమ సిబ్బంది శక్తి వంచనలేకుండా కృషి చేస్తున్నారని దీనికి రైతులు సహకరించాలని కోరారు. ఖరీఫ్ పంట కాలంలో నవధాన్యాలు పంటలు 30 వేల ఎకరాలు సాగు చేసారని అదే రబీలో 40 వేల ఎకరాల్లో సాగు చేయటానికి ప్రణాళిక రూపొందించామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం విస్తరణకు తమ వంతు కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే అనేక వేలమంది రైతులు ప్రకృతి వ్యవసాయ బాట పట్టారని డివిజన్‌లో నిడదవోలు నియోజక వర్గంలో ఎక్కువ మంది రైతులు ఈ సాగు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మూడు మండలాలకు చెందిన 14 మంది ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు చంద్రశేఖర్ , మేరీ కిరణ్, ప్రకృతి వ్యవసాయాధికారులు కృపావతి, రామకృష్ణ, హరిష్, సతీష్ పాల్గొన్నారు.

పేద ముస్లింలకు దుప్పట్ల పంపిణీ

నిడదవోలు : హిందూ, ముస్లింలు సోదరభావంతో ఉంటూ మత సామరస్యం చాటాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. పట్టణంలో పెద్ద మసీదులో రంజాన్ మాసం సందర్భంగా శనివారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు మోర్త ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 150 మంది పేద ముస్లిం మహిళలు, వృద్ధులకు దుప్పట్లు, డ్రై ఫ్రూట్స్ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్ ఎస్కే వజీరుద్దీన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: గోపవరం శివారులో బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు శనివారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం వేలివెన్నుకు చెందిన పి.వీరవెంకట సత్యనారాయణ బైక్‌పై అనపర్తి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా గోపవరం శివారులో ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన సత్యనారాయణను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎవరి సంబరం వారిదే !

కొవ్వూరు: టీడీపీలో నెలకొన్న వర్గ విభేదాలు ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారాయి. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీలో ఉన్న రెండు గ్రూపులు వేర్వేరుగానే నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవ వేడుక నిర్వహించారు. మరో వైపు స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణ టీడీపీ కార్యాలయంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఒకే పార్టీకి చెందిన నాయకులు రెండు గ్రూపులుగా వేర్వేరుగా వేడుకలు నిర్వహించడంతో కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదా ఇచ్చినా, జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి ఇచ్చినా జవహర్‌కి మాత్రం కొవ్వూరులో నిర్వహించే పార్టీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనకుండా అధిష్టానం కట్టడి చేయడంపై షెడ్యూల్డు కులాలు చెందిన కార్యకర్తలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. దళితులకు పదవులు ఇచ్చామని చెప్పడానికే తప్ప పెత్తనం మాత్రం చంద్రబాబు సామాజిక వర్గం నేతలదేనని వారంటున్నారు.

జనసేనపై టీడీపీ సవతి తల్లి ప్రేమ

తాళ్లపూడి: ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ, కొవ్వూరు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ మాత్రమే అధికారం చెలాయిస్తూ, జనసేన నాయకులపై సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని ఆ పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆరోపించారు. తాళ్లపూడి మండలంలోని ప్రక్కిలంకలో శుక్రవారం రాత్రి మండల జనసేన నాయకులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీవీ రామారావు మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలో పలు చోట్ల వెలుగు చూసిన మట్టి తవ్వకాలు, మద్యం విక్రయాలు, ఇసుక కుంభ కోణాలతో జన సైనికులకు ఏ మాత్రం సంబంధం లేదని అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఆరికిరేవుల నుంచి వాడపల్లి వరకు గల ఏ ఒక్క ఇసుక రీచ్‌లలో ఒక్క జనసైనికుడికి అవకాశం ఇవ్వలేదని ఆయన అన్నారు.

పాడి రైతులకు రూ.18 కోట్ల బోనస్

నల్లజర్ల: పాడి రైతులకు గత డిసెంబర్ నుంచి ఈ నెల వరకూ రూ.18 కోట్ల బోనస్ అందిస్తున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఘంటా నాగేశ్వరావు తెలిపారు. నల్లజర్లలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రూ.3 కోట్లు చెల్లించనున్నామన్నారు. వెన్న 10 శాతం ఉన్న పాలకు రూ.82తో పాటు మరో రూ.10 అదనంగా చెల్లిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధిక పాల ధర చెల్లిస్తున్నామన్నారు. ప్రతి 4 నెలలకోసారి బోనస్ పంపిణీ, సబ్సిడీపై పశువుల దాణా, కల్యాణమస్తు, క్షీరబంధు, ప్రతిభ వంటి సంక్షేమ కార్యక్రమాలు, పశువైద్య సేవలు, హై ఈల్డింగ్ సెమన్ అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో మేనేజర్ బి.మూర్తి, పాల సంఘాల అధ్యక్షులు నందమూరి రామకృష్ణ, పెండ్యాల వీర రాఘవులు, మద్దిపాటి దుర్గరాజు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి



దేవరపల్లిలో శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు



గణపతి సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

దేవరపల్లి: ఇటీవల రాజమహేంద్రవరంలో అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ మండల యునైటెడ్ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం దేవరపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక సంత మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ మీదుగా మూడు రోడ్ల జంక్షన్ వరకు జరిగింది. బస్టాండ్, మూడు రోడ్ల జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా అసోసియేసన్ అధ్యక్షుడు ఇర్లపాటి డేవిడ్‌రాజు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల మరణంపై సమగ్రమైన దర్యాప్తు చేసి వాస్తవాలను బయపెట్టాలని డిమాండ్ చేశారు. పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, అసభ్యపదజాలంతో దూషిస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పాస్టర్ ఈదూరి డెవిజ్ రాజు మాట్లాడుతూ పాస్టర్లపై దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

నిడదవోలు : రాజమండ్రిలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం పలు అనుమానాలకు తావిస్తోందని దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వివిధ క్రైస్తవ సంఘాల పాస్టర్లు, క్రైస్తవులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ముంగర రత్నమ్మ హాలులో శనివారం వివిధ సంఘాలకు చెందిన పాస్టర్లు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ మరణంపై క్రైస్తవ లోకానికి అనేక అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పలువురు పాస్టర్లు డిమాండ్ చేశారు. అనంతరం ముంగర రత్నమ్మహాలు నుంచి ప్లకార్డులు పట్టుకుని పట్టణంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. స్థానిక గణపతి సెంటర్‌లో పాస్టర్లు, క్రైస్తవులు మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.